## క్లుప్తంగా

### మహాలక్ష్మి అమ్మవారి జాతర ప్రారంభం

**తాళ్లరేవు:** కోరంగి పంచాయతీ పెదబొడ్డు వెంకటాయపాలెం గ్రామదేవత శ్రీ మహాలక్ష్మి అమ్మవారి జాతర మహోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని స్థానిక నదిలో స్నానం చేయించేందుకు గ్రామస్తులందరూ డప్పుల వాయిద్యాలు, బాణాసంచా కాల్పులతో ఊరేగింపుగా తీసుకువెళ్లారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ కుటుంబ సమేతంగా తరలిరావడంతో గ్రామంలో సందడి నెలకొంది. అనంతరం అమ్మవారిని ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

### అన్నదానం

**అమలాపురం టౌన్:** గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక గడియారం స్తంభం సెంటర్‌లోని శ్రీలక్ష్మీ గణపతి ఆలయం ఆధ్వర్యంలో ఏర్పాటైన వినాయక చవితి చలువ పందిరిని తిలకించేందుకు శుక్రవారం వేలమంది భక్తులు తరలివచ్చారు. తొలుత లక్ష్మీగణపతి స్వామిని దర్శించుకున్నారు. నవరాత్రి మహోత్సవాల్లో మూడో రోజు శుక్రవారం మధ్యాహ్నం పట్టణ టింబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నదానం జరిగింది. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ చిక్కాల రాంబాబు, టింబర్ అసోసియేషన్ ప్రతినిధులు పొన్నాడ కుమార్, నందివాడ బాబి పాల్గొన్నారు.

### ఎయిడ్స్ నియంత్రణ అందరి బాధ్యత

**యానాం:** ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ అందరి బాధ్యత అని, వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలసిన ఆవశ్యకత ఉందని ఆర్ఎఓ మునిస్వామి పేర్కొన్నారు. శుక్రవారం జాతీయ ఎయిడ్స్ నియంత్రణాసంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఆర్ఎఓ ఆఫీసులో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ ప్రతినిధి న్యాయవాది పేర్ని ఆదినారాయణ, ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణసుధాకర్, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

### అధిక దిగుబడులపై అవగాహన

**యానాం:** యానాం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ కమిటీ భవనంలో అధిక దిగుబడులపై రైతాంగానికి ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు సహదేవరెడ్డి, గిరిజారాణి, నందకిషోర్‌లు విచ్చేసి ఇంటిగ్రేటెడ్ న్యూట్రియంట్ మేనేజ్‌మెంట్ ఇన్ పాడీ అనే అంశంపై మాట్లాడారు. వరి సాగులో ఎరువుల వినియోగం, సస్యరక్షణా చర్యలు, ఎలుకలను అరికట్టడం, అధిక దిగుబడులకు తీసుకోవాల్సిన చర్యలు గూర్చి వివరించారు. ఈ కార్యక్రమంలో యానాం ఫార్మర్స్ అండ్ ప్రొడ్యుసర్స్ కోపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్, డిడి శివసుబ్రహ్మణ్యం, వ్యవసాయాధికారి జోగిరాజు, పరిసర ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

### హెవీ మోటార్ వెహికల్ ఉచిత శిక్షణ

**అమలాపురం రూరల్:** ఎస్సీ కులాలకు చెందిన అభ్యర్థులకు హెవీ మోటార్ వెహికల్ ఉచిత శిక్షణ ఇస్తామని ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జె.సత్యవతి తెలిపారు. స్త్రీలు దరఖాస్తు చేసుకొనేందుకు గడువు తేదీని సెప్టెంబరు 5వ తేదీ వరకు పెంచారన్నారు. కోనసీమ జిల్లాకు చెందిన షెడ్యూల్ కులాలకు చెందిన 5 మంది స్త్రీలకు హెవీ మోటార్ వెహికల్ ఉచిత శిక్షణ ఇవ్వాలని నిర్ణయించినట్లు ఎస్సీ ఈడీ సత్యవతి తెలిపారు. ఆసక్తి గల షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులు 20 ఏళ్ల వయసు పైబడిన, కనీసం ఏడాది కాలపరిమితి గల లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోనసీమ జిల్లాకు చెందిన స్త్రీ అభ్యర్థుల గడువు తేదీని సెప్టెంబర్ 5 సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు జె.సత్యవతి తెలిపారు. కార్యనిర్వాహక సంచాలకుడు, జిల్లా షెడ్యూల్డ్ కులాల సహకార సంఘం లిమిటెడ్, ప్రగతి భవన్, కాకినాడ-533001కు దరఖాస్తులు సమర్పించాలన్నారు. అభ్యర్థి పేరు, తండ్రి/భర్త పేరు, పుట్టిన తేదీ, వయసు, విద్యార్హత జెరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీ జత చేయాలన్నారు. సమాచారం కోసం ఆసక్తి గల అభ్యర్థులు కార్యాలయం సూపరింటెండెంట్ రాజు సెల్ నెంబర్ 62818 17023కు సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

### గురుకుల విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

**అమలాపురం రూరల్:** జిల్లాలోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహల్లో డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల సమస్యలు పరిష్కరించి హాస్టళ్ల పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించాలని కోరుతూ జిల్లా దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ నిశాంతిని కలసి శుక్రవారం వినతిపత్రం అందించారు. జిల్లాలో ఎస్సీ హాస్టళ్ల గోడి, శివకోడు, ముమ్మిడివరం, నరేంద్రపురం, ద్రాక్షారామ బాలుర/బాలికల గురుకుల పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు 500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. వారికి మెరుగైన వసతులు నాణ్యమైన విద్య, ఆహారం అందించి పరిశుభ్రత మెరుగుపరిచి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు డీబీ లోక్, కన్వీనర్ జంగా బాబూరావు, కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, కో కన్వీనర్ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు పాల్గొన్నారు.

# కలసి రాని ఖరీఫ్

- తొలకరిపై తెగుళ్ల దాడి
- సాగు సాయానికి ప్రభుత్వం మంగళం
- ఆందోళనలో అన్నదాతలు



మురమళ్లలో తెగుళ్లు సోకిన వరి చేను

**ఐ.పోలవరం:** ఎన్నో ఆశలతో ఖరీఫ్ సాగును ప్రారంభించిన రైతన్నకు ఆదిలోనే ఎదురుదెబ్బలు తగులుతుండడంతో ముందడుగు వేయడానికి వణుకుతున్నాడు. అప్పులు చేసి లక్షల్లో పెట్టుబడులు పెట్టామని ఈ సమయంలో చేలను పురుగుల రూపంలో తెగుళ్లు దాడి చేసి నష్టం కలిగిస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పుడికే భారీగా పెట్టుబడులు పెట్టామని ఇప్పుడు తెగుళ్ల వ్యాధితో మరింత ఖర్చులు పెరిగాయని వాపోతున్నారు. ఈ ఏడాది అసలే సాగు సాయం అందలేదన్న నిరాశలో ఉన్న అన్నదాతకు సాగు సాఫీగా సాగనీయకుండా తెగుళ్ల అడ్డుపడుతున్నాయి. తొలకరి తొలి రోజులలో వర్షాలు కురవక చేనుకు నీరందలేదు. వరి చేలు దుబ్బులు చేసుకుంటున్న సమయంలో వర్షాలు..వరదలు ముంచుత్తుతుండడంతో ఆయకట్టు నిరుత్సాహానికి గురవుతున్నారు.

**క్లస్టర్ పరిధిలో ఇలా..**

ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాల పరిధిలో మొత్తం 37,419 ఎకరాల్లో విస్తరంగా వరిసాగు జరుగుతోంది. ఇందులో భాగంగా ఐ.పోలవరంలో 5,811, ముమ్మిడివరంలో 5,298, కాట్రేనికోనలో 5,251, కాకినాడ జిల్లా తాళ్లరేవు (తూర్పు డెల్టా) పరిధిలో 8,500 ఎకరాల చొప్పున మొత్తం వెరసీ 24,857 ఎకరాలలోనూ, అమలాపురం నియోజకవర్గం పరిధిలో అల్లవరం మండలం 2,877, ఉప్పలగుప్తం మండలం 4,795, అమలాపురంలో 4,872 ఎకరాల్లో వరిసాగు జరుగుతోంది.

**పురుగు మందుల కోసం..**

తెగుళ్ల నివారణ కోసం రైతులు రూ.వందల్లో ఖర్చు చేస్తున్నారు. ఎకరాకు పురుగ మందు కోసం రూ.600 నుంచి 800 వరకు ఖర్చు చేస్తున్నారు. మరికొందరు రూ.1000 వరకు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు.

**అన్నీ అవాంతరాలే**

అనుకున్న సమయానికి సాగునీరంద లేదు. నారుమడుల నాట్లు ఆలస్యంగా పడ్డాయి. ఈ నేపథ్యంలో కురిసిన కొద్దిపాటి వర్షాలకు తోడు.. వరదలు కూడా రావడంతో చేలు నీట మునిగాయి. ఇప్పుడు ఖరీఫ్ వరి పైరుపై తెగుళ్ల బెడద మొదలు కావడంతో అన్నదాతలను ఆందోళనకు గురి చేస్తోంది. ఈ విధంగా ఈ ఏడాది ఖరీఫ్‌కు అన్నీ అవాంతరాలే ఎదురవుతున్నాయి. సుడిదోమ, నల్లి, ఆకు ఎండు తెగుళ్లు, మాగుడు వంటివి పంటలను ఆశించి నష్టం కలిగిస్తున్నాయి. తెగుళ్ల వ్యాప్తి మరింత పెరిగితే ఆప్రభావం దిగుబడులపై పడుతుందని రైతులు వాపోతున్నారు. అవసరాన్ని బట్టి రైతులు తక్షణం సస్యరక్షణ చర్యలు చేపడితే తెగుళ్ల బెడదను అరికట్టవచ్చునని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

**సాగు సాయమేదీ..**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పేరిట రైతులకు సాగు సాయం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే అందేది. ప్రస్తుతం కూటమి పాలకులు రైతు భరోసా సాయం ప్రకటనలకే పరిమితం చేశారు. అంతా అన్నదాతలే ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో తడమోపిడై కుదేలవుతున్నాడు.

### నివారణ చర్యలు..

వరి సాగును వివిధ రకాల తెగుళ్ల ఆశిస్తున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారిని వాణి తెలిపారు. కాండం తొలిచే పురుగు నివారణకు కార్పాట్ హైడ్రోక్లోరైడ్ మందును లీటరు నీటికి రెండు ఎంఎల్ చొప్పున 200 లీటర్లు మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో ఆకు ఎండు తెగుళ్లకు ప్రత్యేకంగా చర్యలు అవసరం లేదన్నారు. యూరియా అధిక మోతాదులో వాడటం, పొలంలో నీరు నిల్వ ఉండటం వల్ల తెగుళ్ల ఉధృతి ఇంకా పెరిగే అవకాశముందన్నారు. ఉధృతి ఎక్కువగా ఉంటే పొలాన్ని బాగా అరబెట్టి ప్లాంటామైసిన్, లేదా బ్యాక్టిరియా మైసిన్ మందును లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున ఎకరాకు 200 లీటర్లు మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ప్రస్తుతం పంటను ఆశించి ఉన్న తెగుళ్లపై తమ శాఖ సిబ్బంది గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. అవసరం మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టే విధంగా రైతులను సూచనలు ఇస్తున్నట్లు ఆమె వివరించారు.

**ప్రకృతి కన్నెర్ర**

ప్రస్తుత వాతావరణంలో చోటుచేసుకొన్న మార్పులు, ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసాలు ఖరీఫ్ పంటపై ప్రభావం చూపుతున్నాయి. నాట్లు ఆలస్యం కావడం వల్ల వరి మూనలు దుబ్బులు చేస్తున్నాయి. ముందుగా సాగు చేసిన చోట చిరు పొట్టదశలో ఉన్నాయి. కాండం తొలిచే పురుగు కారణంగా దుబ్బు మధ్యలో ఎండి పోవడంతో వెన్ను విరిగి పోయి పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతొంది. ఆకు ఎండుతెగులు ప్రభావంతో ఆకు అంచులు చివరి వరకూ ఎండి పోతుంది. దీని వలన ఆకు ద్వారా మొక్కకు అందాల్సిన పోషకాలు లభించక పంట ఎదుగుదలపై ప్రభావం చూపుతుందని రైతులు చెబుతున్నారు.

## వైఎస్సార్ సీపీ అభివృద్ధికి కృషి చేయాలి



సామ్యూల్ సాగర్‌ను అభినందిస్తున్న జగ్గిరెడ్డి

**తాళ్లరేవు:** వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన దొమ్మేటి గోర్డన్ సామ్యూల్ సాగర్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లు అభినందించారు. శుక్రవారం సామ్యూల్ ఇరువురు నేతలను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ ఎమ్మెల్యేలు దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు. పార్టీ అభివృద్ధికి శక్తిమేర కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు కాదా గోవిందకుమార్ తదితరులు ఉన్నారు.

## ఆర్ఎఓగా అంకిత్ కుమార్ నియామకం



**యానాం:** యానాం నూతన రీజినల్ అడ్మినిస్ట్రేటర్‌గా ఐఏఎస్ అధికారి అంకిత్‌కుమార్‌ను నియమిస్తూ శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి డాక్టర్ శరత్ చౌహాన్ ఆదేశాలు జారీచేశారు. ఆయనకు యానాం మున్సిపల్ కమీషనర్‌గా సైతం అదనపు బాధ్యతలు నిర్వహించాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్ఎఓగా ఉన్న మునిస్వామిని పుదుచ్చేరి డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిసిటీ అండ్ ఇన్‌ఫర్మేషన్ శాఖ అధికారిగా బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

**అభివృద్ధి పనులకు విఘాతం**

బదిలీపై వెళుతున్న ఆర్ఎఓ మునిస్వామి వైఖరితో నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.22 కోట్లు నుంచి రూ.25 కోట్ల వరకు అభివద్ధి పనులకు విఘాతం కలిగిందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ మండిపడ్డారు. మునిస్వామి సహాయ నిరాకరణతో తాను 6నెలల నుంచి ఆర్ఎఓ ఆఫీసుకు సైతం వెళ్లలేదని శుక్రవారం మీడియాకు తెలిపారు. ఆయన వ్యవహార శైలిపై ఎల్జీ కె.కైలాషనాథన్‌కు ఫిర్యాదు చేశానన్నారు. ఈ మేరకు ఆయన స్థానంలో నూతనంగా ఐఏఎస్ అధికారి నియామకం చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

## గుర్తింపు పొందని పార్టీలు విచారణకు హాజరు కావాలి

**అమలాపురం రూరల్:** జిల్లా వ్యాప్తంగా గుర్తింపు పొందని రాజకీయ పార్టీలు 2019 నుంచి ఒక్క ఎన్నికలో పోటీ చేయని రాజకీయ పార్టీల ప్రతినిధులు సెప్టెంబర్ 8న అమరావతిలో నిర్వహించే విచారణకు హాజరుకావాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జై సమైక్య ఆంధ్ర పార్టీ ఈ ఆరేళ్లలో జిల్లాలో ఒక్క ఎన్నికలో కూడా పోటీ చేయలేదన్నారు. ఈ పార్టీ విచారణ తేదీని సెప్టెంబర్ 8న ఉదయం 11.40 గంటలకు షెడ్యూల్ చేసినట్లు తెలిపారు. అటువంటి విచారణకు అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, పార్టీ అధిపతి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. పార్టీ నుంచి ఎటువంటి సమాధానం లేనిచో తగిన చర్య తీసుకోబడుతుందన్నారు.

## బ్రహ్మాజీకి ఎమ్మెల్సీ పరామర్శ



బ్రహ్మాజీని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, నాయకులు

**అమలాపురం టౌన్:** ఇటీవల గుండెకు శస్త్ర చికిత్స చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న స్థానిక 12వ వార్డుకు చెందిన దోనూరి బ్రహ్మాజీని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ శుక్రవారం పరామర్శించి ఆయన ఆరోగ్య క్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్సీతో పాటు 12వ వార్డు కౌన్సిలర్ కట్టోజు సన్యాసిదాసు, వైఎస్సార్ సీపీ నాయకులు వేగిరాజు సాయిరాజు, మద్దింశెట్టి ప్రసాద్, కట్టోజు రాము తదితరులు బ్రహ్మాజీని పరామర్శించారు.

## పదోన్నతులపై ఉత్తర్వులు జారీ

**యానాం:** యానాం పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ (పీడబ్ల్యూడీ) ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు (ఈఈ)గా కాళ్ల నాగరాజుకు పదోన్నతిని కల్పిస్తూ శుక్రవారం రాత్రి పుదుచ్చేరి చీఫ్ ఇంజినీర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన అసిస్టెంట్ ఇంజినీరుగా విధులు నిర్వహిస్తున్నారు.

# ఆకట్టుకున్న ఫ్రెషర్స్ డే వేడుకలు




ఫ్రెషర్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న కరెస్పాండెంట్ కృష్ణ సతీష్

**అమలాపురం రూరల్:** పట్టణంలో ప్రారంభమైన బీవీసీ అక్షర ఇంటర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులను స్వాగతిస్తూ ఫ్రెషర్స్ డే వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. పేరూరులో బీఆర్‌కే కల్యాణ మండపంలో ఈ వేడుకలు నిర్వహించారు. వేదిక ద్వారా కొత్త విద్యార్థులకు స్నేహపూర్వక వాతావరణాన్ని కలిగించడమే లక్ష్యమని సంస్థ గౌరవ చైర్మన్ బోనం కనకయ్య అన్నారు. కరస్పాండెంట్ బోనం కృష్ణసతీష్, కోశాధికారి బోనం విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను పెట్టుకుని అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీన్, ప్రిన్సిపాల్ అడబాల దుర్గారావు, ఫిజిక్స్ హెడ్ భీమాన జానకిరామ్, కెమిస్ట్రీ హెడ్ కటకం రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**భట్లపాలెంలో జాతీయ క్రీడా దినోత్సవం**

భట్లపాలెం బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ కార్యదర్శి కె.పద్మనాభం ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరకంగానే కాకుండా మానసికంగా దృఢంగా ఉంటారని తెలిపారు.పద్మనాభంను ఘనంగా సత్కరించారు. పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించిన బీవీసీ కళాశాల ఎంబీఏ విద్యార్థి మారే వీరేంద్రను బెస్ట్ స్పోర్ట్స్‌మన్ అవార్డుతో సత్కరించారు. స్టేట్ ప్యానెల్ అంపైర్స్, యూ.విక్రమ్, జె.సురేష్‌లను మెమెంటోతో సత్కరించారు. ప్రిన్సిపాల్, డాక్టర్. జీవీజీ రామారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎంవీఎస్ మదన్, ఏవో జక్కం కృష్ణారావు, గోకరకొండ నాగేంద్ర, కళాశాల ఫిజికల్ డైరెక్టర్లు కె.రవి సుధీర్, ఎం.పార్వతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# క్రీడాసామగ్రి అందజేత



విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ అందజేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

**అమలాపురం టౌన్:** క్రీడా ప్రోత్సాహంతోనే క్రీడాకారులకు పతకాల పంట సాకారమవుతుందని మాజీ జాతీయ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు, ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించే దిశగా మా ఫౌండేషన్ చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. హాకీ మాంత్రికుడు ధ్యానచంద్ జయంతి, నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన క్రీడాకారులకు, విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీలో ఎమ్మెల్సీ మాట్లాడారు. 50 మంది క్రీడాకారులు, విద్యార్థులకు బాస్కెట్ బాల్స్, షూలు, టీ షర్ట్‌లు తదితర క్రీడా సామగ్రితో ఉన్న స్పోర్ట్స్ కిట్లను ఆయన పంపిణీ చేశారు. మా ఫౌండేషన్ ప్రతినిధి వాసంశెట్టి చినబాబు చేస్తున్న క్రీడా సేవలను ఎమ్మెల్సీ కొనియాడారు. డీవైఈవో గుబ్బల సూర్య ప్రకాశం, స్టేట్ బ్యాంక్ అధికారి ఎం.నాగేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.విజయకుమారి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పారి సతీష్ తదితరులు అతిథులుగా పాల్గొని విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. శ్రీరామపురం నాయకుడు రాయుడు సత్య రుషి తదితరులు పాల్గొన్నారు. ఇదే ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా వెటరన్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారుడు చీకురుమిల్లి కిరణ్‌కుమార్‌ను ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు ఘనంగా సత్కరించి అభినందించారు. ఆంధ్ర యూనివర్శిటీ బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి, జెడ్పీ స్కూల్ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు పూసపాటి పద్మ కూడా పాల్గొని కిరణ్‌కుమార్‌ను అభినందించారు.

# ఘనంగా సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

**అమలాపురం రూరల్:** బండారులంక మట్టపర్తివారిపాలెంలో వేంచేసిన సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామివారి చవితి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మూడో రోజు శుక్రవారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. కాలెపు మోహన్‌రావు అర్చకత్వాన మహిళలతో సామూహిక కుంకుమార్చనను కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలకు అమ్మవారి ప్రతిమ, గాజులు, రుద్రాక్ష, కాటన్ బ్యాగ్‌ను కమిటీ వారు అందించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

**మహిళల గానామృతం**

**అమలాపురం టౌన్:** గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా స్థానిక మహిపాలవీధిలోని లక్ష్మీ గణపతి ఆలయంలో స్వామి సన్నిధిలో మహిళలు సామూహిక గణేశ కల్యాణ గానామృతం, లలిత సహస్ర నామ పారాయణాన్ని ఆలపించారు. శుక్రవారం సాయంత్రం స్వామి వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేసి ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని చేపట్టారు. లింగాష్టకం, బిల్వాష్టకం నిర్వహించారు. ప్రవచనకర్త కృష్ణ బలరామ గోవిందం మాట్లాడుతూ గణపతి నవరాత్రుల ప్రాశస్త్యం గురించి వివరించారు. ఆలయ యువజన సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా భక్త సమాజం వారు ఈ పూజలు, గానామృతాలు, పారాయణలు చేపట్టారు.

# విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

**యానాం:** యువతీ, యువకులు విద్యతో పాటు క్రీడారంగానికి ప్రాధాన్యతనివ్వాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం భారత హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ క్రీడాదినోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలు జీవితంలో ఆరోగ్యం, మానసిక ఉల్లాసాన్ని, జట్టు భావనను నేర్పుతాయన్నారు. అనంతరం రీజినల్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేసి బదిలీపై పుదుచ్చేరి వెళ్తున్న మునిస్వామిని దుస్సాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, శాయ్‌అకాడమీ ఇన్‌ఛార్జి ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా క్రీడా దినోత్సవం**

**ఉప్పలగుప్తం:** మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజు సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని గొల్లవిల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని జి. కనకదుర్గ ఆధ్వర్యంలో ఒలింపిక్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో మూడు పాఠశాలలకు చెందిన క్రీడాకారులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు అమలాపురం కిమ్స్ ఆస్పత్రి వారి సౌజన్యంలో బహుమతులు, ప్రశాంసపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## పిచ్చికుక్క స్వైర విహారం

**పి.గన్నవరం:** గ్రామంలో శుక్రవారం ఓ పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. మొత్తం ఆరుగురిని కరవడంతో వారు గాయాల పాలయ్యారు. స్థానిక సీహెచ్‌సీలో నలుగురు బాధితులు చికిత్స చేయించుకుని ఇళ్లకు వెళ్లారు. ఇద్దరికి ఎక్కువగా గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరుగురిని కరిచిన పిచ్చికుక్కను పట్టుకునేందుకు స్థానికులు, వ్యాపారులు ప్రయత్నించగా పారిపోయింది. ఈ నేపథ్యంలో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని వ్యాపారులు విజ్ఞప్తి చేశారు.

## ఐటీఐ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

**యానాం:** నేతాజీ సుభాష్‌చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో డిజైన్ అండ్ టెక్నాలజీ, వైర్‌మెన్, కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్(సీఓపీఎ) ట్రేడ్లలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయడానికి ఎపీ ప్రాంత అభ్యర్థులకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ సిహెచ్ కృష్ణసుధాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు సంబంధిత పత్రాలతో ఈ నెల 30న కళాశాలకు వచ్చి నేరుగా ప్రవేశాలు పొందవచ్చునన్నారు. ప్రవేశ రుసుము రూ.6,050 చెల్లించాలన్నారు.

# ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



కళాసాహితి ఆధ్వర్యంలో గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

**అల్లవరం:** ప్రభుత్వ పాలనంతా తెలుగు భాషలో నిర్వహించిన నాడు తెలుగు భాషకు పూర్వ వైభవం వస్తుందని, న్యాయస్థానాల్లో తీర్పు తెలుగులో వెల్లడించాలని, పాఠశాలల్లో తెలుగులో బోధన జరగాలని కళావేదిక జాతీయ సీఈఓ కత్తిమండ ప్రతాప్ అన్నారు. అల్లవరంలోని రవితేజ కాలేజీలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు భాష పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు. అన్ని భాషల్లోకెల్లా తెలుగు భాష గొప్పదని, ఇప్పుడు తెలుగు భాష పూర్వ వైభవాన్ని కోల్పోతుందన్నారు. తెలుగు భాషని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి తెలుగు బిడ్డపై ఉందన్నారు. గిడుగు రామ్మూర్తి, గురజాడ, మొల్ల వేషధారణ విద్యార్థులు అలరించారు. అనంతరం కళావేదిక సీఈఓ ప్రతాప్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళావేదిక ప్రముఖులు మాకే బాలార్జున సత్యనారాయణ, బీవీవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**వన్నెచింతలపూడిలో..**

**అమలాపురం రూరల్:** వన్నెచింతలపూడిలో జెడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా 100 మంది తెలుగుకవుల ఛాయా చిత్రాలతో జీవిత విశేషాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. తెలుగు భాషా దినోత్సవం, హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతి జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. మామిడిశెట్టి శ్రీనివాసరావు, వ్యాయామోపాధ్యాయుడు విఘ్నేశ్వరుడును ప్రధానోపాధ్యాయుడు జి.నాగసత్యనారాయణ పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. గ్రామస్తులు తెలుగు భాష అభిమానులు పాల్గొన్నారు.

**అమ్మ భాషకు గొడుగు గిడుగు**

**అమలాపురం టౌన్:** అమ్మ భాషకు గిడుగు రామ్మూర్తి పంతులు ఓ గొడుగులా నీడ, తోడై ఉన్నారని వాకర్స్ జిల్లా గవర్నర్ సప్పా నాగేశ్వరరావు అన్నారు. అమలాపురం మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక తారకరామ నగర్‌లో శుక్రవారం జరిగిన తెలుగు భాషా దినోత్సవ కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ నాగేశ్వరరావు మాట్లాడారు. తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించి ఆయన తెలుగు భాషకు చేసిన కృషిని వివరించారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు యర్రమిల్లి అనంతలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గోటేటి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

**దేశ భాషలందు తెలుగులెస్స**

**ఐ.పోలవరం:** వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం గర్వకారణమని పంచాయతీ కార్యదర్శి మూర్తి అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా స్థానిక పీటీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలుగు వెలుగులు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. శనివారం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, 31వ తేదీన ఆరుద్ర జయంతితో కార్యక్రమాలు ముగుస్తాయని పీటీఎం సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పాలెపు వెంకటేశ్వరరావు తెలిపారు.

**వేడుకగా తెలుగు భాషా దినోత్సవం**

**ముమ్మిడివరం:** గ్రాంధిక భాషను వాడుక భాషగా మార్చిన మహోన్నత వ్యక్తి గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతినే తెలుగు భాష దినోత్సవంగా జరుపుకుంటున్నామని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ ఎంజీఆర్ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలు ఎస్.స్వర్ణకుమారి మాట్లాడుతూ శ్రీ కృష్ణదేవరాయులు కీర్తించిన గొప్ప భాష తెలుగు భాషని కొనియాడారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు, అధ్యాపకేతరులు పాల్గొన్నారు. శ్రీ కృష్ణదేవరాయ మహిళా జూనియర్ కళాశాల, డాక్టర్ రావు బహుదూర్ రఘుపతి వెంకటరత్నంనాయుడు మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు భాష దినోత్సవ వేడుకలను నిర్వహించారు. **కళాసాహితీ ఆధ్వర్యంలో..** కళాసాహితీ లలిత కళలసేవా వేదిక ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. శ్రీలక్ష్మీ శ్రీనివాసన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు తెలుగు జాతి ఔన్నత్యాన్ని వివరించారు.